క్లుప్తంగా

గుత్తి సబ్ జైలు తనిఖీ



మాట్లాడుతున్న సెక్రటరీ రాజశేఖర్

గుత్తి: హైకోర్టు ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్, గుత్తి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఆరవ అదనపు జిల్లా జడ్జి సాదు బాబు ఆధ్వర్యంలో గుత్తి స్పెషల్ సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులో బ్యారెక్లు, టాయిలెట్స్, వంట గది, స్టోర్ రూము, రికార్డులు పరిశీలించి ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేశారు. గుత్తి సబ్ జైలు సూపరింటెండెంట్ మహేష్‌తో మాట్లాడుతూ జైల్ ఆవరణలో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పానెల్ అడ్వకేట్ వీసీ గంగాధర్, కోర్టు సిబ్బంది, టైపిస్టు సాధిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న జడ్జి అనిల్‌కుమార్ నాయక్

పెద్దపప్పూరు: బాల్యవివాహాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తాడిపత్రి సివిల్ జడ్జి అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని జూటూరులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల కట్టడిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల, ఏపీఎం శివకుమార్‌రెడ్డి, ఏఎస్ఐ హమానుల్లా, సీసీ గంగయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటి సర్వేపై కమిటీ

తాడిపత్రి రూరల్: వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి సర్వే కోసం కమిటీ ఏర్పాటు చేశామని మునిసిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం వైస్ చైర్మన్ షెక్షావలి అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటి సర్వేకు సంబంధించిన నోటీసును మాజీ ఎమ్మెల్యే భార్య రమాదేవి తీసుకోకపోవడంతో ప్లాట్ నెంబర్ 1 నుంచి 16 వరకూ మునిసిపల్ స్థల ఆక్రమణపై పంచనామా నిర్వహించడానికి ప్రభుత్వ అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో జరిపిన ప్రాథమిక సర్వేలో మాజీ ఎమ్మెల్యే ఇళ్లు రెండు సెంట్ల మునిసిపల్ స్థలంలో ఉందని, ఆ స్థలం కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిందని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ వైస్ చైర్మన్‌కు కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. అనంతరం 32 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

హెచ్చెల్సీ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఆనంద్

శింగనమల: నార్పల మండలంలోని నరసాపురం సమీపంలోని హెచ్చెల్సీ కాలువను శనివారం స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. కాలువలో ఉపాధి హామీ పథకం పనులు ఎంత వరకూ చేశారని ఎంపీడీఓ మమతాదేవిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎర్రమ్మ, అధికారులు, సాగునీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పెద్దవడుగూరు మండలం గుత్తి వెంకటాంపల్లికి చెందిన రాముడు అనే యువకుడు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు మందలించారనే నెపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నార్పల వాసి నేత్రదానం



రెడ్‌క్రాస్ ప్రతినిధులకు తండ్రి నేత్రాలను అందిస్తున్న కుమారుడు రాజేష్

శింగనమల: నార్పలలోని గవ్వల కాలనీకి చెందిన శ్రీరాములు(52) మృతిచెందడంతో, ఆయన నేత్రాలను కుమారుడు రాజేష్ రెడ్‌క్రాస్ సంస్థకు అందించి మానవత్వం చాటుకున్నారు. నార్పలలోని గవ్వల కాలనీకి చెందిన రైతు శ్రీరాములు శనివారం మృతిచెందాడు. కళ్లను దానం చేస్తే, మరొకరికి చూపు వస్తుందని భావించిన కుమారుడు రాజేష్.. బాధలోను కుటుంబసభ్యులను ఒప్పించి రెడ్‌క్రాస్ సంస్థకు నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. రాజేష్‌ను పలువురు అభినందించారు.



గుంతకల్లులో గణేష్ విగ్రహాల శోభాయాత్ర



గుంతకల్లులో కలశాలతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న రాజేంద్రనగర్ వాసులు



యాడికిలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గుంతకల్లులో నిమజ్జనోత్సవానికి తరలివెళ్తున్న రెడ్డి సంఘం వినాయకుడు



గుంతకల్లులోని వినాయక ఘాట్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వినాయకా.. సెలవిక

గుంతకల్లుటౌన్: పట్టణంలో గణేశుడి నిమజ్జనోత్సవం కనుల పండువగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగ ఒడికి చేరాడు. శనివారం సాయంత్రం రైల్వేగ్రౌండ్ వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాల శోభాయాత్రను ప్రారంభించారు. జై బోలో గణేష్ మహరాజ్ కీ జై నినాదాలతో పురవీధులు హోరెత్తాయి. లంబోదరుడి శోభాయాత్రను తిలకించేందుకు వచ్చిన జనంతో ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. శోభాయాత్రలో యువతీ,యువకులు, చిన్నపిల్లలే కాకుండా వృద్ధులు సైతం నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వినాయకఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పోలీసులు, మున్సిపల్, అగ్నిమాపక, రెవెన్యూ, విద్యుత్, తదితర శాఖల సిబ్బంది ఎంతో శ్రమించారు. వినాయకఘాట్ వద్ద వేలాది మంది భక్తాదులకు నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భోజన వసతిని ఏర్పాటు చేశారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని వినాయక విగ్రహాలను శనివారం మధ్యాహ్నం ఆటోల్లో, ట్రాక్టర్లలో ఉంచి మండలంలోని వేముల పాడు సమీపంలో రాయలచెరువు, తాడిపత్రి రహదారిలో మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న వంకలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఈరన్న, ఎస్ఐ రమణయ్య, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. ఎస్ఐ ఆంజనేయులు బందోబస్తు నిర్వహించారు. ఆయా కాలనీల వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



యాడికిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహాలు



పెద్దవడుగూరులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



గుంతకల్లులోని భాగ్యనగర్‌లో ఉట్టి కొడుతున్న మహిళలు

సామరస్యంగా ఊరేగింపు చేసుకోవాలి



మత పెద్దలతో మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

తాడిపత్రిటౌన్: పండుగల వేళ సామరస్యంగా ఊరేగింపులు నిర్వహించుకోవాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి సూచించారు. తాడిపత్రి పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో శనివారం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే వినాయక శోభాయాత్ర ఊరేగింపులో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకుండా అన్ని మతాల వారు సమన్వయనం పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు పూజలు



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో నిర్వహించిన వినాయకచవితి వేడుకల్లో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా, సీనియర్ నాయకుడు, మాజీ సమన్వయకర్త వీఆర్ రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బొందెలదిన్నె రాఘవరెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాది వేలూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేరం స్వర్ణలతకు 'ఆలూరు' పరామర్శ



తాడిపత్రిలో పేరం స్వర్ణలతను పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి



యల్లనూరులో భోగతి విజయ ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

తాడిపత్రిటౌన్: అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స తీసుకుని తాడిపత్రి పట్టణంలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను ఆ పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ అండగా ఉంటుందని భరసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పుట్లూరు ఎంపీపీ రాఘవరెడ్డి, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిని పరామర్శించిన సాంబశివారెడ్డి

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, యల్లనూరు జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డిని శనివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నారై వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. ఇటీవల మెడ భాగంలో శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రతాప్‌రెడ్డిని వెన్నపూసపల్లిలోని నివాసంలో కలిసి, ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం మండల సీనియర్ నాయకుడు భోగతి నారాయణరెడ్డిని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పుట్లూరు ఎంపీపీ రాఘవరెడ్డి, మేడికుర్తి సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, మూలి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

గార్లదిన్నె: వినాయక నిమజ్జనం సందర్భంగా గార్లదిన్నెలో దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని శింగనమల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఆయన ఎస్సీలతో కలసి సీఐ, ఎస్ఐని కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనంలో చిన్న పాటి గొడవ జరిగి అక్కడే సద్దుమణిగి పోయినా.. టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ నాయుడు ఉద్దేశ్యపూర్వకంగా అనుచరులతో కలసి దళిత యువకులపై దాడులు చేశారన్నారు. దళితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు నిర్లక్ష్యంగా కేసు నమోదు చేయకపోగా, కౌంటర్ కేసు నమోదు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. దళితులపై దాడి చేసిన వారిపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. లేని పక్షంలో దళితులతో కలసి ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు

యాజమాన్య పద్ధతులపై అవగాహన

పామిడి: మండలంలోని పాళ్యంతండా గ్రామ పొలాల్లో శనివారం వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై డీఆర్సీ ఏఓ రుమీనాబేగం, రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, చీడపీడల గురించి వివరించారు. యూరియా అధికంగా వాడడం వల్ల వాటిల్లే నష్టాలను తెలిపారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం యాజమాన్య పద్ధతులకు సంబంధించిన కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఏఓ విజయకుమార్, వీహెచ్ఏ హరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'గొడవలతో ప్రాణాలు తీసుకోవద్దు'

బుక్కరాయసముద్రం: చిన్న గొడవలతో ప్రాణాలు తీసుకోవద్దని సీఐ పుల్లయ్య సూచించారు. మండలంలోని దయ్యాలకుంటపల్లిలో నరసమ్మ గుడి వద్ద కుటుంబ కలహాలతో ఉరేసుకుంటున్న దండువారిపల్లికి చెందిన నారాయణస్వామిని పోలీసులు కాపాడారు. ఆటో డ్రైవర్ నారాయణస్వామి భార్యతో గొడవపడి చెట్టుకు ఉరేసుకుంటు ఉండగా స్థానికులు వారించారు. వినకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి నారాయణస్వామిని కాపాడి స్టేషన్‌కు తరలించారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలి

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం వినాయకుల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచే నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభం కావాలన్నారు. అల్లర్లకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. అందరూ కలసిమెలిసి ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు.

మద్యం దుకాణాలు మూసివేయాలి

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో ఆదివారం జరిగే వినాయక విగ్రహాల సమూహిక నిమజ్జనం శోభాయాత్ర కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలోని మద్యం దుకాణాలను మూసివేయించాలని శ్రీరామ భక్త మండలి అధ్యక్షుడు నిచ్చెనమెట్ల రాధాక్రిష్ణ కోరారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శోభాయాత్రలో గంధం పౌడర్ చల్లిన వారిని, మద్యం, గంజాయి సేవించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు.

పోలీసులు ఎవరినీ కొట్టలేదు

రాప్తాడు: గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈనెల 29న బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో పోలీసులు ఎవరినీ కొట్టలేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు స్పష్టం చేశారు. శనివారం ఆయన రాప్తాడులోని అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో సీఐ పుల్లయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చెన్నంపల్లిలో పోలీసులు కొందరిని కొట్టినట్లు సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. అంతవరకూ పుకార్లు వ్యాప్తి చేయొద్దన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శింగనమల: నార్పలలోని సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న హనీఫ్ కుటుంకలహాలతో ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు అతడిని ఆటోలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

పామిడి: మండల కేంద్రంలో పలువురు మట్కా రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. బస్టాండ్ ప్రాంతంలో మట్కా ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు బస్టాండ్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. పోలీసులను గమనించి పారిపోతున్న వారిని వెంబడించి మరీ ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు రూ.1,13,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

బాబు వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్



హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు

బుక్కరాయసముద్రం: చంద్రబాబు వైఫల్యాలను ప్రజలకు వివరిద్దామని శింగనమల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజక, మండల, గ్రామస్థాయి వైఎస్సార్ సీపీ పార్టీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. శైలజానాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువై ఏడాది దాటినా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా చంద్రబాబు సక్రమంగా నెరవేర్చలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే అందజేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలు కూటమి ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వీటికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేద్దామని వివరించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. అనంతరం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంపై చర్చించారు. ప్రభుత్వ వైపల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పని చేయాల్సి ఉందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బీకేఎస్ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, ఐదు మండలాల కన్వీనర్లు నార్పల సత్యనారాయణరెడ్డి, గోకుల్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో శనివారం తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆర్డీటీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్ పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఇంటిపట్టాలు, రేషన్‌కార్డులు, భూ సమస్యలపై ప్రజలు అర్జీలను అందజేశారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

యల్లనూరు: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ రామాంజనేయరెడ్డి సూచించారు. శనివారం వెంకటాంపల్లిలో గ్రామస్తులు, మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్నవయస్సులోనే ఆడ పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పీఎస్ఐ సురేష్, గ్రామస్తులు శంకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం: పీఎం కుసుమ్ యోజన కింద పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం అవసరమైన స్థలం కోసం శనివారం సాయంత్రం చెన్నంపల్లిలో కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. సర్వే నంబర్ 103లోని 50 ఎకరాల భూములకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సోలార్ 12 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ కోసం ప్రైవేటు భూమిని రైతుల ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా భూమి విక్రయించిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులకు ప్లాంట్ ఏర్పాటుపై పలు సూచనలు ఇచ్చారు. ఆ తర్వాత గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మన్, మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ ప్రతినిధులు, ఏడీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక ప్రార్థనలు

గుంతకల్లుటౌన్: ముస్లింల అత్యంత పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా పోర్టర్స్‌లైన్‌లోని దర్గా వద్ద శనివారం ఖాన్ క్యాటరింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు మిలాద్ ఉన్ నబీ విశిష్టత, మహమ్మద్ ప్రవక్త గొప్పతనాన్ని వివరించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షాబుద్దీన్ ఖాన్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పెద్దపప్పూరు: మండలంలోని జోడి ధర్మాపురం(బ్రాహ్మణ అగ్రహారం) గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ అనే మహిళ అదృశ్యమైనట్లు శనివారం బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజుల నుంచి ఆమె కనిపించలేదని భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మిద్దెపై నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కోట వీధికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి మిద్దె దిగుతూ ఫిట్స్ రావడంతో జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం

యల్లనూరు: ఏడాది కిందట చోరీకి గురైన ద్విచక్ర వాహనం నిందితుడి నుంచి శనివారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. నిందితుడు చెక్కా మురళిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో పీఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుల్ బాలరాజు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

యాడికి: అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మేఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు ఆదర్శంగా నిలిచారు. వివరాలు.. మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న తేరు మిద్దె వద్ద 60 ఏళ్ల పైబడిన వృద్ధుడు శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసులు వెంటనే మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బండారు బాలకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, సుధాకర్, అశోక్‌కుమార్ తదితర సభ్యులు మృతదేహాన్ని ఓ వాహనంలో శ్మశానానికి తరలించి అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేస్, హెచ్‌పీసీ సాంబ శివ గౌడ్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మహిళపై దాడి

శింగనమల: నార్పల మండలం వెంకటాంపల్లిలో ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. వివరాలు.. వెంకటాంపల్లికి చెందిన జమీలా భర్తతో విడాకులు తీసుకుని, తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. రోజు కూలిపనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. శనివారం అదే గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి ఆమెపై కత్తితో దాడి పారిపోయారు. ఆమెకు గాయాలవడంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై నార్పల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని కల్లూరుకు చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుడ్నుడు. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా వివరాల మేరకు..రాజశేఖర్(32) అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. మద్యం తాగేందుకు డుబ్బులు ఇవ్వాలని భార్యను నిత్యం వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.